క్లుప్తంగా

పెద్దారెడ్డిని గెలిపించండి


ఓటు అడుగుతున్న పేరం గోకుల్‌నాథరెడ్డి

తాడిపత్రిరూరల్: ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డిని గెలిపించాలని పేరం గోకుల్‌నాథరెడ్డి కోరారు. పట్టణంలోని పప్పూరు క్రాస్‌లో శుక్రవారం ఆయన ప్రచారం చేశారు. సంక్షేమ పథకాలు అమలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సాధ్యమన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలను అటకెక్కిస్తారని, ప్రజలు ఇబ్బంది పడుతారన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక


వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో శుక్రవారం టీడీపీ నుంచి 10 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. పార్టీలోకి చేరినవారికి ఏపీ ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలోకి చేరామన్నారు. టీడీపీలో కార్యకర్తలకు న్యాయం జరగలేదన్నారు. పార్టీలోకి చేరిన వారిలో పాముల శ్రీనివాసులు, ఉప్పరపల్లి నాగరాజు, గోసల నాగరాజుతో పాటు మరో 10 మంది ఉన్నారు.

జనం మెచ్చిన నాయకుడు జగనన్న


ప్రచారం చేస్తున్న మైనార్టీ నాయకుడు ఫయాజ్ బాషా

తాడిపత్రి: జనం మెచ్చిన నాయకుడు జగనన్న.. ఆయనను మరోమారు ఆశీర్వదిస్తే, సంక్షేమ పథకాలు మీ గడపలకే చేరుతాయని మైనార్టీ నాయకుడు, వైఎస్సార్‌సీపీ 2వ వార్డు కౌన్సిలర్ హీరాపురం ఫయాజ్‌బాషా అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని 2వ వార్డు బండా మసీద్, పడమట గేరి, పల్లవి ఫంక్షన్ హాల్ తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు చేకూరిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీగా శంకర్‌నారాయణ, తాడిపత్రి ఎమ్మెల్యేగా కేతిరెడ్డి పెద్దారెడ్డిని గెలిపించాలన్నారు.

వైఎస్సార్‌సీపీని గెలిపించండి


వృద్ధురాలిని ఓటు అడుగుతున్న రమేష్‌రెడ్డి

తాడిపత్రిరూరల్: ఎన్నికల్లో అవ్వాతాతలందరూ వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి గెలిపించాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి కోరారు. పట్టణంలోని 10వ వార్డులో శుక్రవారం ఆయన ప్రచారం చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఎమ్మెల్యే పెద్దారెడ్డికి ఓటు వేయాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. అధికార దాహంతో టీడీపీ నాయకులు చేస్తున్న అరాచకాలకు ఫుల్‌స్టాప్ పడాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగన్‌ను మరోసారి సీఎం చేసుకుందామన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతల ఇంటింటి ప్రచారం


చాగల్లులో ప్రచారం చేస్తున్న ఎంపీపీ

పెద్దపప్పూరు : ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎంపీగా శంకరనారాయణ, ఎమ్మెల్యేగా కేతిరెడ్డి పెద్దారెడ్డిలను అఖండ మెజారిటీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. శుక్రవారం మండలంలోని చాగల్లు, తబ్జూల, శింగనగుట్టపల్లి, అమ్మలదిన్నె, పాల్యం, కొత్తపల్లి గ్రామాల్లో వారు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు.జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాతే చాగల్లు, ముచ్చుకోట, పెండేకల్లు జలాశయాలకు నీరు విడుదల చేయించడంతో రైతన్నల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీపీ రామ్మూర్తి రెడ్డి, ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వేమనాథరెడ్డి, జిల్లా పార్లమెంట్ జనరల్ సెకరట్రీ రవిప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీలు నారాయణ, శకుంతల, సర్పంచు గౌతమి, కోఆప్షన్ సభ్యుడు హాజీవలి, నామనాంకపల్లి రఘునాథ రెడ్డి, వరదాయపల్లి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ఉద్దండులకు పుట్టినిల్లు

నియోజకవర్గ ముఖచిత్రం – శింగనమల


శింగనమల రంగరాయుల చెరువు

శింగనమల పేరు చెప్పగానే రాజకీయ ఉద్దండులు గుర్తుకొస్తారు. మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి, కమ్యూనిస్టు పోరాట యోధుడు తరిమెల నాగిరెడ్డి, ప్రముఖ కవి విద్వాన్ విశ్వం ఈ నియోజకవర్గానికి చెందిన వారే. నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడుగా మారినప్పటి నుంచి ఇక్కడ ఏ పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తారో, ఆ పార్టీ ప్రభుత్వమే కొలువుదీరుతోంది. దీంతో ఈ నియోజకవర్గం సెంటిమెంట్ నియోజకవర్గంగా మారింది. అలాగే పార్టీలు మారి పోటీచేసే నాయకులను తిరస్కరిస్తుండడం ఇక్కడి ఓటర్ల ప్రత్యేకత – శింగనమల

- ఇక్కడ ఏ పార్టీ విజయమో.. ఆ పార్టీదే అధికారం
- కొనసాగుతున్న 'సెంటిమెంట్'
- పార్టీ మారి పోటీ చేసిన వారికి ఆదరణ కరువు

నియోజకవర్గ ప్రత్యేకతలు:

- నియోజకవర్గంలో సాగు భూములు ఆధికం. వరి, చీనీ, అరటి తదితర పండ్ల తోటలకు ప్రత్యేకత. అరటి పంట పుట్లూరు, యల్లనూరు మండలాల నుంచి ఇతర దేశాలకు ఎగుమతి అవుతుంది.
- నార్పల మండలంలోని గూగూడు కుళ్లాయిస్వామి, ఆంజనేయ స్వామి దేవాలయాలు ప్రసిద్ధి.
- జిల్లాలోనే అతి పెద్ద చెరువు శింగనమల రంగరాయుల చెరువు. చెరువు విస్తీర్ణం దాదాపు 2,600 ఎకరాలు ఉంది. ఈ చెరువులోని చేపలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌కు ఎగుమతి అవుతాయి.
- శింగనమలలో అతి పురాతన రామాలయం ఉంది. శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని ఒంటి మిట్ట దేవాలయంలో రాముల వారి కల్యాణం జరుగుతుందో అదేరోజు రాత్రి ఇక్కడ రాముల వారి కల్యాణం నిర్వహిస్తారు.
- గార్లదిన్నె మండలంలోని పెనకచెర్ల గ్రామం వద్ద మిడ్ పెన్నార్ డ్యాం ఉంది. ఈ డ్యాం నుంచి శింగనమల, గుంతకల్లు , తాడిపత్రి నియోజకవర్గాల్లోని ఆయకట్టు భూమికి హెచ్చెల్సీ నీరు సరఫరా అవుతుంది.
- గార్లదిన్నె మండలంలోని కోటంక గ్రామంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయం ప్రసిద్ధి.
- దక్షిణ భారతదేశంలోని వ్యవసాయ యంత్రాల శిక్షణ, పరిరక్షణ సంస్థ గార్లదిన్నెలోని ట్రాక్టర్‌నగర్‌లో ఉంది.

ఓటర్ల వివరాలు

శింగనమల నియోజకవర్గం
మొత్తం ఓటర్లు: 2,47,373
పురుషులు: 1,22,927
మహిళలు: 1,24,417
ఇతరులు: 29



నియోజకవర్గ సమాచారం:

సచివాలయాలు–87	డిజిటల్ లైబ్రరీలు–36
రైతు భరోసా కేంద్రాలు–85	విలేజ్ హెల్త్ క్లినిక్‌లు–55
వెల్‌నెస్ సెంటర్లు–52	


శింగనమల గ్రామ సచివాలయం

నియోజకవర్గ స్వరూపం

మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి, కమ్యూనిస్టు పోరాట యోధుడు తరిమెల నాగిరెడ్డి, ప్రముఖ కవి విద్వాన్ విశ్వం ఈ నియోజకవర్గానికి చెందిన వారే. నిత్య చైతన్యశీలురైన ఓటర్లు తమదైన తీర్పును ఇస్తూనే ఉన్నారు. నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడుగా మారినప్పటి నుంచి ఇక్కడ ఏ పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తారో, ఆపార్టీ ప్రభుత్వం ఏర్పడుతోంది. దీంతో ఈ నియోజకవర్గం సెంటిమెంట్ నియోజకవర్గంగా మారింది. పార్టీలు మారి పోటీ చేసిన వారిని, ఇంతవరకూ గెలిపించకపోవడం ఇక్కడ ఓటర్ల ప్రత్యేకత. శింగనమల నియోజకవర్గం గతంలో పుట్లూరు నియోజకవర్గంగా ఉండేది. నియోజకవర్గ పునర్విభజనలో భాగంగా 1967లో శింగనమల నియోజకవర్గంగా ఏర్పడింది. 1978లో ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంగా మారింది. మండలాల వ్యవస్థ ఏర్పడిన తరువాత నియోజకవర్గంలో శింగనమల, గార్లదిన్నె, నార్పల, బుక్కరాయసముద్రం, కూడేరు, ఆత్మకూరు మండలాలు ఉన్నాయి. ఆ తరువాత 2009 ఎన్నికల్లో నియోజకవర్గంలోని కూడేరు , ఆత్మకూరు మండలాల బదులు తాడిపత్రి నియోజకవర్గంలోని పుట్లూరు, ధర్మవరం నియోజకవర్గంలోని యల్లనూరు మండలాలు చేరాయి. ప్రస్తుతం నియోజకవర్గంలో శింగనమల, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరు, యల్లనూరు మండలాలున్నాయి.

రాజకీయ పోరు

శింగనమల నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడుగా మారినప్పటి నుంచి అధికారంలోకి వచ్చే పార్టీకి మాత్రమే పట్టం కట్టారు. పార్టీలు మారి పోటీ చేసిన వారిని గెలిపించక పోవడం విశేషం. 1967లో నియోజకవర్గం ఏర్పడిన మొదటి ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థి కుమ్మెత రంగారెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థి చిన్న రంగయ్య శెట్టి, గెలుపొందారు. 1972లో కాంగ్రెస్ అభ్యర్థి తిమ్మారెడ్డిపై స్వ తంత్ర అభ్యరి తరిమెల రంగారెడ్డి గెలుపొందారు. 1978లో ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంగా మారడంతో.. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కె.ఆనందరావుపై జనతాపార్టీ అభ్యర్థి బి.రుక్మిణీదేవి విజయం సాధించారు. 1983లో కాంగ్రెస్ అభ్యర్థిపై టీడీపీ అభ్యర్థి గురుమూర్తి గెలుపొందారు. 1985 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పామిడి శమంతకమణిపై టీడీపీ అభ్యర్థి కె.జయరాం గెలిచారు. 1989 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి బీసీ గోవిందప్పపై కాంగ్రెస్ అభ్యర్థి పామిడి శమంతకమణి విజయం సాధించారు. 1994 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పామిడి శమంతకమణిపై టీడీపీ అభ్యర్థి కె.జయరాం గెలిచారు. 1999లో కాంగ్రెస్ అ భ్యర్థి సాయిరాంపై టీడీపీ అభ్యర్థి కె.జయరాం గెలిచారు. 2004లో టీడీపీ అభ్యర్థి పామిడి శమంతకమణిపై కాంగ్రెస్ అభ్యర్థి శైలజానాథ్ విజయం సాధించారు. 2009లో టీడీపీ అభ్యర్థి పామిడి శమంతకమణిపై కాంగ్రెస్ అభ్యర్థి సాకే శైలజానాథ్, గె లిచారు. 2014లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి జొన్నలగడ్డ పద్మావతిపై టీడీపీ అభ్యర్థి యామిబాల గెలిచారు. 2019లో టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిపై వైఎస్సార్‌సీపీ అభ్యర్థి జొన్నలగడ్డ పద్మావతి, విజయం సాధించారు.

ప్రస్తుతం శింగనమల బరిలో వీరే..


వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వీరాంజనేయులు

శింగనమల అసెంబ్లీ నియోజకవార్గనికి సంబంధించి 14 మంది బరిలో ఉన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎం.వీరాంజినేయులు, టీడీపీ అభ్యర్థిగా బండారు శ్రావణిశ్రీ, కాంగ్రెస్ అభ్యర్థిగా సాకే శైలజానాథ్, ఆల్ ఇండియా కిసాన్ జనతా పార్టీ – కప్పల నాగరాజు, జైభీంరావు భారత్ పార్టీ – జి.రామాంజనేయులు, తెలుగు రాజాధికార సమితి పార్టీ– వెంకటసుబ్బన్న, జై మహాభారత్ పార్టీ – సాకే శ్రీదేవి, స్వతంత్ర అభ్యర్థులుగా ఎం.ఆనంద్‌కుమార్, కాయల రాంమోహన్, కొడమల ఓబిలేసు, ఎం.మాధవ, ఎం.నల్లప్ప, వి.సాయి ప్రసాద్ పోటీలో ఉన్నారు.

శింగనమల నియోజకవర్గంలో వివిధ పథకాలతో లబ్ధి

సంక్షేమ పథకం (డీబీటీ ద్వారా)	లబ్ధిదారులు	లబ్ధి (రూ. కోట్లలో)
వైఎస్సార్ పెన్షన్ కానుక	52,887	503.72
వైఎస్సార్ రైతు భరోసా	53,911	281.37
జగనన్న అమ్మ ఒడి	34,879	153.74
డా.వైఎస్సార్ ఉచిత పంటల బీమా	27,513	152.84
వైఎస్సార్ ఆసరా	48,287	169.40
వైఎస్సార్ చేయూత	19,214	85.31
డా.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	16,726	58.03
విద్యా దీవెన	21,093	53.03
పేదలకు ఇళ్ల నిర్మాణం	3,592	38.15
వైఎస్సార్ సున్నా వడ్డీ (సహకార సంఘాలకు)	65,435	32.94
జగనన్న వసతి దీవెన	19,460	22.04
వైఎస్సార్ నేతన్న నేస్తం	1,934	14.71
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	5,137	14.36
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	10,557	13.00
వైఎస్సార్ భీమా	612	10.24
కరోనా కష్ట కాలంలో పేదలకు సాయం	81,318	8.13
డా.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఆసరా	10,814	6.84
సీఎం రిలీఫ్ ఫండ్	898	5.40
వైఎస్సార్ వాహన మిత్ర	1,833	5.19
జగనన్న చేదోడు	2,204	4.85
వైఎస్సార్ కాపు నేస్తం	1,138	3.88
వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా	112	0.85
జగనన్న తోడు (చిరు వ్యాపారులకు వడ్డీ మాఫీ)	4,527	0.20
డీబీటీ మొత్తం	4,02,763	1,638.20
నాన్ డీబీటీ		
పేదలందరికీ ఇళ్ల స్థలాలు	14,892	372.30
పేదలకు రేషన్ పంపిణీ	87,031	190.70
జగనన్న గోరుముద్ద	21,095	20.90
జగనన్న విద్యా కానుక	23,056	16.37
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	6,962	14.50
జగనన్న తోడు (చిరు వ్యాపారులకు)	7,822	13.05
విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ	3,122	4.12
నాన్ డీబీటీ మొత్తం	1,63,980	631.94
డీబీటీ+నాన్ డీబీటీ మొత్తం	5,66,743	2,270.16

చంద్రబాబు మాటలు నమ్మి మోసపోవద్దు


కనంపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శంకరనారాయణ, వీరాంజనేయులు, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా


ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులుకు డప్పులతో స్వాగతం పలుకుతున్న దృశ్యం

- జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం
- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శంకరనారాయణ, వీరాంజనేయులు

గార్లదిన్నె: సాధ్యం కాని హామీలతో మభ్యపెడుతున్న చంద్రబాబు మాటలు నమ్మి మోసపోవద్దని అనంతపురం ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ, శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు కోరారు. శుక్రవారం మండలంలోని కనంపల్లి, పాపినేపాళ్యం, ఎగువపల్లి, కల్లూరులో వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా కనంపల్లిలో నల్లమ్మ అమ్మవారి ఆశీర్వాదం తీసుకుని ప్రచారం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జెడ్పీ చైర్మన్ బోయ గిరిజమ్మ, రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రచారంలో పాల్గొన్నారు. కనంపల్లి, కల్లూరులో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు టపాకాయలు కాల్చుతూ పూలమాలలతో అపూర్వ స్వాగతం పలికారు. ఎంపీ,ఎమ్మెల్యే అభ్యర్థులు ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓట్లు అభ్యర్థించారు. అనంతరం వారు మాట్లాడుతూ 2019 ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. 'జగన్ చెప్పాడంటే.. చేస్తాడంతే' అనే నమ్మకం ప్రజల్లో కలిగిందన్నారు. 2024 ఎన్నికల్లో కూడా చేయకలగిన హామీలను మాత్రమే మేనిఫెస్టో పెట్టి సీఎం జగన్ ఎన్నికలకు సిద్ధమయ్యారన్నారు. ఫ్యాన్ గాలికి టీడీపీ కనుమరుగవుతుందన్నారు. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఆకర్షితులై టీడీపీకి గుడ్‌బై చెప్పి చాలామంది వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. చంద్రబాబు సీఎం పదవి కోసం అమలు కానీ హామీలను సూపర్ సిక్స్ అంటూ అడ్డుగోలుగా ప్రకటించి ప్రజలను మరోసారి మోసం చేసేందుకు సిద్ధమయ్యారన్నారు. జనం మెచ్చేనేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపిస్తే సంక్షేమ పథకాలు మళ్లీ ఇంటికే వస్తాయన్నారు. పేదల సంక్షేమమే వైఎస్ జగన్ అజెండా అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, ఎంపీపీ వెంకటనారాయణ, అనంతపురం మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ కుంచం రామ్మోహన్ రెడ్డి, మాజీ ఎంపీపీ ప్రదీప్ రెడ్డి, పాలిఏకరి కార్పొరేషన్ చైర్మన్ పరంధామ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, జంబులదిన్నె సొసైటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో దూసుకుపోతున్న ఎమ్మెల్యే కుటుంబం


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి


ఓంశాంతి నగర్‌లో ఓటు అడుగుతున్న కేతిరెడ్డి రమాదేవి

తాడిపత్రిరూరల్/టౌన్: పోలింగ్‌కు కేవలం 10రోజులు మాత్రమే ఉండటంతో ఎమ్మెల్యే పెద్దారెడ్డి కుటుంబ సభ్యులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎమ్మెల్యే పెద్దారెడ్డి గెలుపు కోసం శ్రమిస్తున్నారు. పట్టణంలో శుక్రవారం వేర్వేరుగా ఎమ్మెల్యే సతీమణి రమాదేవి, పెద్ద కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డి, చిన్న కుమారుడు సాయిప్రతాప్‌రెడ్డి, కోడళ్లు సాయి అర్చితారెడ్డి, మౌన అమృతారెడ్డి ప్రచారం చేశారు. కేతిరెడ్డ రమాదేవి ఉదయం ఓంశాంతి నగర్, సాయంత్రం సీపీఐ కాలనీలో ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. పెద్దకుమారుడు హర్షవర్ధన్‌రెడ్డి మండలంలోని ఇగుడూరు గ్రామంలో, చిన్న కుమారుడు సాయి ప్రతాప్‌రెడ్డి సంకుకమ్మ పాలెం, పెద్దకోడలు సాయి అర్చితారెడ్డి టైలర్స్‌కాలనీ, చిన్న కోడలు మౌన అమృతారెడ్డిలు 36వ వార్డుతో పాటు చుక్కలూరు గ్రామంలో ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యే పెద్దారెడ్డికి ఓటు వేయాలని కోరారు. సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. ఆయా కార్యక్రమాల్లో రమణమ్మ, పల్లె నాగేశ్వరెడ్డి, విజయ్‌కాంత్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, ఈశ్వరెడ్డి, విశ్వనాథ్, శ్రీరంగ, చంద్ర, కిట్టా, ఆచారి, ప్రసాద్‌రెడ్డి, రాజారాం, నాగభూషణం, సత్యారెడ్డి, ఓబయ్య, భాషా, హరీష్‌రెడ్డి, హనుమంతరెడ్డి, రాజు, బాలరాజు, కిరణ్, నాగేష్, గోపాల్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కోడలు మౌనామృతారెడ్డి


టైలర్స్ కాలనీలో మహిళను ఓటు అడుగుతున్న ఎమ్మెల్యే కోడలు సాయి అర్చితారెడ్డి

నేడు వీరాంజనేయులు ప్రచారం

నార్పల: శింగనమల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎం.వీరాంజినేయులు శనివారం మండల కేంద్రంలో ప్రచారం చేయనున్నట్లు రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నిట్టూరు రఘునాథ్‌రెడ్డి, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయనతో పాటు అనంతపురం ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల శంకరనారాయణ, రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి హాజరవుతారన్నా రు. ఉదయం 7:00 నుంచి తిక్కస్వామి గుడి వద్ద నుంచి ప్రచారం ప్రారంభం అవుతుందన్నారు. అనంతరం రామస్వామి వీధి, అంబేద్కర్‌నగర్, చౌడమ్మ కట్ట, ఆంజనేయ స్వామి వీధి, పోతులయ్యకట్ట, గవ్వలవీధి, కోటవీధి, చింతవనం కొట్టాల,సుల్తాన్‌పేట,గార బావి కొట్టాల,చర్చ్ కాలనీ,ఉద్దిబావిచేను కాలనీలో ప్రచారం కొనసాగుతుందన్నారు. పార్టీ శ్రేణులు హాజరై జయప్రదం చేయాలన్నారు.

వైఎస్సార్‌సీపీకి ఓటు వేయండి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులను గెలిపించాలని కోరుతూ మండల నాయకులు ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ పార్వతి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను మరోసారి సీఎం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆలూరురమణారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, పూల నారాయణస్వామి, చికెన్ నారాయణస్వామి, కొండమ్మ, నందినేని మల్లికార్జున, చేపల రమణ, చంద్రమోహన్, ఈశ్వరయ్య, పూల రంగా, సాయి, పవన్, రవి తదితరులు పాల్గొన్నారు.

జేసీ సోదరులు గజ దొంగలు


సభకు హాజరైన ప్రజలు, నాయకులు, కార్యకర్తలు


బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దవడుగూరు: గత 30 ఏళ్లలో తాడిపత్రి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో జేసీ సోదరులు ఆధిపత్యం కోసం ఎన్నో దారుణాలు చేసి పబ్బం గడుపుకున్నారని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన గజదొంగలని ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఎంపీ అభ్యర్థి శంకర్‌నారాయణ ధ్వజమెత్తారు. శుక్రవారం మండలంలోని .తిమ్మాపురం, అప్పేచర్ల, వీరేపల్లి, జి.వెంకటాంపల్లి, విరుపాపురం, పి.కొత్తపల్లి, గుత్తి అనంతపురం, కాశేపల్లి, మిడుతూరు, పెద్దవడుగూరు గ్రామాల్లో వారు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దవడుగూరు గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు మాట్లాడుతూ సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. గతంలో జన్మభూమి కమిటీలు చెప్పిన వారికి మాత్రమే సంక్షేమ పథకాలు అందించిన నీచమైన ఘనత టీడీపీదన్నారు. టీడీపీ నాయకులను గెలిపిస్తే రాష్ట్రంలో అరాచకాలు పెరుగుతాయన్నారు. జేసీ సోదరులు తప్పుడు రిజిస్ట్రేషన్లతో వాహనాలు కొనుగోలు చేసి రహదారులపై తిప్పుతూ ప్రజల జీవితాలతో ఆడుకున్నారన్నారు. గ్రామాల్లో కక్షలు పెట్టి పైశాచిక ఆనందం పొందడం జేసీ సోదరులకు బాగా తెలుసన్నారు. టీడీపీ నాయకుల నిర్వాకంతో పింఛన్‌దారులు అవస్థలు పడుతున్నారన్నారు. జగనన్న ముఖ్యమంత్రి అయిన వెంటనే తిరిగి వలంటీర్లు ఇళ్ళ వద్దకే పింఛన్లు అందించే కార్యక్రమం చేపడతామన్నారు. వైఎస్సార్‌సీపీ వచ్చిన తరువాత పెద్దవడుగూరు మండలం రైతులకు రెండు పంటలకు నీళ్లు అందించామన్నారు. నియోజకవర్గాన్ని ప్రశాంతంగా ఉంచామన్నారు. ఎన్నికల సమయం కావడంతో జేసీ సోదరులు మీ ఇళ్ల వద్దకు వచ్చి తప్పుడు హామీలిస్తున్నారని, వాటిని నమ్మొద్దన్నారు. రైతుల కష్టాలు తెలిసిన జగనన్న మండలానికి రూ.78 వేల కోట్లు ఇన్సురెన్స్ అందజేశారన్నారు. వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తు కి ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మండలంలోని మొదటి పోలింగ్ బూత్ నుండి జేసీ కుటుంబ సభ్యుల పతనం ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నతోనే పేదల సంక్షేమం


లక్షుంపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచు పద్మనాభరెడ్డి


యాడికిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి

యాడికి: జగనన్నతోనే పేదల సంక్షేమం సాధ్యమని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వెంగమనాయడు కాలనీ, రాఘవేంద్ర కాలనీలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఆస్పత్రి కాలనీలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బాలా రమేష్‌బాబు, నారాయణ స్వామి కాలనీలో సీజేఎస్ మండల కన్వీనర్ శివప్రసాద్, రాయలచెరువులో తలారి నాగేష్, తూట్రాళ్లపల్లెలో సర్పంచు సంజీవరాయుడు, లక్షుంపల్లెలో సర్పంచు పద్మనాభరెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుంటేనే పేదలకు న్యాయం జరుగు తుందన్నారు. కార్యక్రమంలో యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, భోగాతి బ్రహ్మానందరెడ్డి, రామకృష్ణ పరమహంస, జగదీస్ చౌదరి, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటరామిరెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డి, సుబ్బయ్య. మాజీ డీలర్ రాము, ఎంపీటీసీలు వెంకటనాయుడు, అవుకు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సజావుగా పోస్టల్ బ్యాలెట్

తాడిపత్రి అర్బన్: నియోజకవర్గంలో ఎన్నికలు విధుల్లో పాల్గొనే పీఓలు, ఏపీఓలు, ఓపీఓలకు ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెటింగ్ సజావుగా సాగింది. మే 13న పోలింగ్ విధుల్లో పాల్గొనే ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల కమిషన్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునేందుకు శుక్రవారం నుంచి 6వ తేదీ వరకూ అవకాశం కల్పించింది. పోలింగ్ రోజు విధుల్లో పాల్గొనే సిబ్బంది మొత్తం 1,505 మంది ఉండగా 167 మంది శుక్రవారం తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నారు.

బొలెరో ఢీకొని యువకుడి మృతి

పెద్దవడుగూరు: ద్విచక్ర వాహనాన్ని బొలెరో ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రిలోని సజ్జలదిన్నెకు చెందిన మహమ్మద్ షఫీవుల్లా (21) శుక్రవారం ద్విచక్ర వాహనంపై గుత్తి వైపుగా వస్తుండగా క్రిష్టిపాడు సమీపంలో జాతీయ రహదారిపై ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన బొలెరో ఢీకొంది. ఘటనలో షఫీవుల్లా అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేశారు.